క్లుప్తంగా

నేడు వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు ఖాయిదా కొట్లు వీధిలోని చాంబర్ కార్యాలయంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లూ చేసినట్లు చాంబర్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ జవ్వార్, ప్రధాన కార్యదర్శి మద్దుల మురళీకృష్ణ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జరిగే శిబిరంలో కళ్లు, దంతాలు, గుండె విభాగాల వైద్యులు సేవలందిస్తారు. బీపీ, షుగరు, గుండెకు సంబంధించిన ఈసీజీ, అవసరం అయిన వారికి 2డీ ఈకో పరీక్షలు నిర్వహిస్తారు. శిబిరానికి వచ్చేవారు తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువెళ్లాలి.

పింఛన్ల పంపిణీ పరిశీలన



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాజ్ మనోజ్

కడియం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పింఛన్లను లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలకే నేరుగా జమచేస్తున్నారు. అయితే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, నడవలేనిస్థితిలో ఉన్నవారు, దివ్యాంగులకు ఇంటి వద్దనే పంపిణీ చేసే ఏర్పాట్లు చేశారు. ఇలాంటి వారిని కడియం మండలంలో 3,444 మందిని గుర్తించారు. శనివారం ఉదయం సచివాలయ సిబ్బంది నేరుగా ఈ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. తొలిరోజు 86 శాతం పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. ఆయన కడియపులంక, పొట్టిలంక, వీరవరం, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు గ్రామాల్లో పంపిణీలో పాల్గొన్నారు.

డేనియల్‌రాజు సేవలు అభినందనీయం



డేనియల్‌రాజును సత్కరిస్తున్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సీటీఆర్ఐ)లో 40 ఏళ్లు టెక్నీషియన్‌గా పనిచేసిన అక్కాబత్తుల డేనియల్‌రాజు సేవలు అభినందనీయమని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ కొనియాడారు. సీటీఆర్ఐ సెమినార్ హాలులో శనివారం డేనియల్‌రాజు ఉద్యోగ విరమణ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డేనియల్ రాజు, వెంకటలక్ష్మి దంపతులను డాక్టర్ శేషుమాధవ్, పలువురు సైంటిస్టులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

ఆహారం పంపిణీ

కడియం: మండలంలోని వేమగిరి గ్రామానికి చెందిన ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 300 మందికి ఆహారం పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు శ్రీకాంత్ కాశి తెలిపారు. రోడ్డు పక్కన నివసించే అన్నార్తులకు ప్రతి నెలా తమ సంస్థ ఆహారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ మదన్ మోహన్, ఆనంద్ పాల్, సరేంద్ర, డేవిడ్ రాజు, రవితేజ, దుర్గాప్రసాద్, మోషే తదితరులు పాల్గొన్నారు. వేమగిరి నుంచి ప్రారంభమై ధవళేశ్వరం, రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్డు, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పంపిణీ కొనసాగింది.

శ్రీశైలానికి కడియం మొక్కలు

కడియం: కడియం ప్రాంత నర్సరీ రైతులు స్వచ్ఛందంగా సేకరించిన పలు రకాల మొక్కలను శనివారం శ్రీశైలం దేవస్థానానికి పంపించారు. వివిధ రకాల అలంకరణ, నీడనిచ్చే మొక్కలను నర్సరీ రైతులు బొరుసు శ్రీనివాసరావు, నక్కా ప్రసాద్, నాగిరెడ్డి రవి, పంతం సుబ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి శ్రీనివాసు సమకూర్చారు. ఈ మేరకు మొక్కలు తీసుకువెళ్లే లారీని కడియపులంక ముసలమ్మవారి ఆలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: మోటార్ బైక్‌పై వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన మరో మోటారు సైక్లిస్టు ఢీకొన్నాడు. బాలాజీపేట రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం కొవ్వూరుకు చెందిన గోరుగంతుల అశోక్ (35), భార్యతో కలిసి బొమ్మూరులో నివసిస్తున్నాడు. అతడు కొవ్వూరులోని అవంతి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. రోజూ బొమ్మూరు నుంచి బైక్‌పై డ్యూటీకి వెళ్లి వస్తుంటాడు. శుక్రవారం రాత్రి కొవ్వూరు నుంచి బొమ్మూరు వస్తుండగా బాలాజీపేట రోడ్డులో ఎదురుగా, అజాగ్రత్తగా, వేగంగా వచ్చిన మరో వ్యక్తి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అశోక్‌కు తలకు తీవ్రమైన గాయం కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అశోక్ తండ్రి శివనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ..

కడియం: వేమగిరి సెంటర్‌లోని ఓ రెస్టారెంట్ వద్ద సుమారు 70 ఏళ్ల వృద్ధుడు అపస్మారకస్థితిలో ఉన్నాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కడియం పోలీసులు తెలిపారు. మృతదేహం మార్చురీలో ఉందని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కడియం పోలీసులను సంప్రదించాలన్నారు.

ఎండా వానా.. అంతుచిక్కేనా..

- విచిత్రంగా వాతావరణం
- నిప్పులు చెరుగుతున్న భానుడు
- సేదతీరుస్తున్న వరుణుడు



గోదావరిపై శనివారం సాయంత్రం కమ్ముకున్న మబ్బులు



ఎండ కారణంగా నగరంలో శుక్రవారం నిర్మానుష్యంగా మారిన రోడ్డు

సీటీఆర్ఐ: ఈ ఏడాది వేసవి కాలం చాలా విచిత్రంగా కొనసాగుతోంది. ఒకసారి మండే ఎండలతో భానుడు చెలరేగిపోగా, కొన్ని రోజులు వరుణుడు వానలతో సేదతీరుస్తున్నాడు. ఏప్రిల్ నుంచి ఎండలు ముదిరిపోయాయి. ఉక్కపోతను తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఎండలకు భయపడి మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడం మానేశారు. ఎండ నుంచి ఉపశమనం కోసం వైద్యుల సలహాలు పాటించారు. అయితే ఆ నెల మధ్యలోనే వరుణుడు పలకరించాడు. దాదాపు వారం రోజులు పాటు వర్షం కురిపించాడు. చల్లని గాలులతో సేదతీర్చాడు.

కొనసాగిన ఎండలు

మే నెలలో మళ్లీ సూర్యుడు విజృంభించాడు. ఎండలకు తోడు ఎన్నికల వేడి కొనసాగింది. మధ్యలో అడపాదడపా వర్షం కూడా కురిసింది. ఇక రోహిణీ కార్తెలో భానుడు తన విశ్వరూపం చూపించాడు. భూమిపై నిప్పులు కురిపించాడు. విపరీతమైన ఎండలతో ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు చాలా అవస్థలు పడ్డారు. ఉదయం సుమారు పది గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకూ వేడి గాలులు వీచాయి. గత వారం రోజులుగా ఎండలు విపరీతంగా కాశాయి. ప్రతి రోజూ సుమారు 40 డిగ్రీలు నమోదయ్యాయి.

ప్రజల బెంబేలు

ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఇళ్లలో ఏసీలు, ఫ్యాన్‌లు, కూలర్లు నిరంతరంగా పనిచేశాయి. శుక్రవారం అయితే దాదాపు 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగలంతా ఇళ్లలో ఉన్న ప్రజలు సాయంత్రం ఆరు గంటలు దాటాక పార్కులు, గోదావరి గట్టును ఆశ్రయించారు. పళ్ల రసాలు, కూల్ డ్రింక్ షాపులు, పుచ్చకాయల దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఎండ నుంచి రక్షణ పొందటానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయించారు. గోదావరి తీరంలో ఘాట్లు సాయంత్రం సందర్శకులతో కిటకిటలాడాయి. ఎండ నుంచి సేదతీరేందుకు అందరూ కుటుంబాలతో కలిసి ఘాట్లకు పోటెత్తారు.

మబ్బులతో ఆహ్లాదం

రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించాయని, త్వరలో వానలు పడతాయని వాతావరణశాఖ చేసిన ప్రకటనతో ప్రజలకు ప్రాణం లేచి వచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం వాతావరణంగా చల్లగా ఉంది. మబ్బులతో నిండిన ఆకాశం ఆహ్లాదం కలిగించింది. శుక్రవారం వరకూ నిప్పులు చెరిగిన భానుడు మబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. చల్లని వాతావరణం కొనసాగుతుందా, లేకపోతే మళ్లీ భానుడు విజృంభిస్తాడా అనే సందేహం ప్రజలలో నెలకొంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

కడియం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2003–04లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చి, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఏడాదిగా కృషి చేసిన శివ, విజయచంద్ర, శ్రీనివాస్, శివరామకృష్ణ, రత్నమాల, విజయకుమారిలను అభినందించారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



విద్యార్థులతో విశ్రాంత హెచ్‌ఎం శ్రీనివాస్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం, సినిమాలు, చిట్‌చాట్ తగ్గించుకుని, తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని విశ్రాంత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీవన నైపుణ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మంచి పుస్తకాలు చదివి జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. సాధు వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను విద్యార్థులు గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, బొడ్డు శ్రీనివాసు, బండారు శంకరరావు, గ్రంథాలయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను కచ్చితంగా పాటించాలి

కంబాలచెరువు: ప్రభుత్వం నిర్దేశించిన విధానాలను ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా అమలు చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు స్పష్టం చేశారు. స్థానిక పేపర్ మిల్లు వద్ద గల కృష్ణ సాయి కల్యాణ మండపంలో శనివారం జిల్లాలోని అన్ ఎయిడెడ్ పాఠశాలల కరెస్పాండెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అకడమిక్ కేలండర్‌లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలలు పనిచేయాలన్నారు. ప్రతి పాఠశాలా విధిగా ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలన్నారు. సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని, గత విద్యా సంవత్సరంలో వచ్చిన సమస్యలను ఈ ఏడాదిలో పునరావృతం కాకుండా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలో పాఠ్య పుస్తకాలను విక్రయించరాదని, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజు వివరాలను విధిగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ కంప్లైంట్ బాక్స్ ఉండాలన్నారు. బస్సుల ఫిట్‌నెస్‌ను సెలవుల్లో నిర్ధారించుకోవాలని, విద్యార్థుల భద్రత అధిక ప్రాధాన్యం నివ్వాలన్నారు. పాఠశాల రికార్డులు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. విద్యార్థుల ఆన్‌లైన్ హాజర్‌ను ఉదయం 10 గంటల లోపు విధిగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈవో కార్యాలయ ఏడీ వి.వెంకట్రాజు, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈఓ ఏ.దుర్గా తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు అందరికీ ఆదర్శనీయం



శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: సుమారు నాలుగు దశాబ్దాల పాటు రైతులకు సేవలందించిన వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్‌వీ శ్రీనివాస్‌ను యువ ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజమహేంద్రవరం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ విస్తరణాధికారి ఎస్‌వీ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం కొంతమూరులోని ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. డీఏవో మాధవరావు మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు సంఘసేవ కార్యక్రమాలలోనూ శ్రీనివాస్ చురుకుగా పాల్గొనేవారన్నారు. రాష్ట్ర ఏఈఓ సంఘ అధ్యక్షుడు వేణుమాధవ్, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు డీవీ కృష్ణ, రాజమహేంద్రవరం, కోరుకొండ, ఆలమూరు, తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, కాకి నాగేశ్వరావు, శశిబిందు, జయరామలక్ష్మి, ఎన్జీవో సంఘ ఉపాధ్యక్షులు ఎం.మాధవరావు, సీహెచ్‌ఎస్‌వీ ప్రసాద్, జి.సింహాచలం, జీఎం శాంతకుమార్ పాల్గొన్నారు.

342 మందికి వైద్యసేవలు

సీతానగరం: రఘుదేవపురం సచివాలయం – 2 పరిధిలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో 342 మందికి పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రాజు సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎం రమణ పాల్గొన్నారు

వైభవంగా హనుమజ్జయంతి



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తరలివచ్చిన భక్తులు



వేమగిరిలో స్వామిని దర్శించుకుంటున్న రావిపాటి తదితరులు



కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లో స్వామికి లక్ష పుష్పార్చన చేస్తున్న పుల్లా చంటియ్య కుటుంబ సభ్యులు



ఆర్యాపురం రామాలయంలో అలంకరణ

కడియం: రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామివారికి తమలపాకులు, సిందూరంతో ప్రత్యేక పూజలు చేశారు. కడియం, బుర్రిలంక, పొట్టిలంక, మురమండ, కడియపుసావరం గ్రామాల్లోని స్వామివారి భారీ విగ్రహాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. బుర్రిలంక జాతీయ రహదారిపై గల స్వామివారి విగ్రహం సమీపంలో భారీ అన్నదానం జరిగింది. కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రముఖ నర్సరీ రైతు పుల్లా చంటియ్య, మహాలక్ష్మి దంపతులు, పుల్లా పెద సత్యనారాయణ, శ్రీదేవి దంపతుల చేతుల మీదుగా 108 రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన, మహాపుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక నివేదనలు సమర్పించారు. మాలధారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. వేమగిరిలో వైఎస్సార్ సీపీ నాయకుడు రావిపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

నగరంలో వైభవంగా..

సీటీఆర్ఐ: నగరంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఎదురుగా గల సువర్చలా సహిత హనుమత్ దేవాలయం, టీటీడీ కల్యాణ మండపం వద్ద గల ఆంజనేయ విగ్రహం, సీతంపేట రామాలయం, కంబాలచెరువు వద్ద సంజీవని హనుమంతుడు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం హనుమన్ హోమం, పంచామృతాభిషేకం, తమలపాకుల పూజలు, సిందూర పూజలు, స్వామివారికి అప్పాల దండలు, వడమాల, హనుమాన్ చాలీసా పారాయణలు జరిగాయి.

ప్రత్యేక పూజలు

ధవళేశ్వరం: హనుమజ్జయంతి సందర్భంగా ధవళేశ్వరంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ప్రసన్నాంజనేయస్వామికి పూజలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం స్వామివారిని అరటిపండ్లతో అలంకరిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చందన నాగేశ్వర్ పూజలు

ధవళేశ్వరం: బస్టాండ్ సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ ముఖ్యమంత్రి కావాలని..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ శనివారం రాత్రి ధవళేశ్వరం అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.



సీతంపేట కోదండ రామాలయంలో భక్తుల పూజలు



ధవళేశ్వరంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న చందన నాగేశ్వర్



ధవళేశ్వరం అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ముద్దాల అను, పోసికుమార్

నేడు చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కాల్‌ఫ్యూషన్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్గత చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఆసక్తి కలవారందరూ ఉదయం ఎనిమిది గంటలకు హాజరుకావాలన్నారు. ఇటీవల జరిగిన ఫిడే రేటింగ్ చాంపియన్ షిప్ చదరంగం పోటీల్లో 1582 పాయింట్లతో శ్రీనికేష్, 1404 పాయింట్లతో తేజశ్రీ విజయం సాధించారని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

కడియం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ కోరారు. మండలంలోని వివిధ పార్టీ రాజకీయ నాయకులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మే 13న జరిగిన పోలింగ్‌లో అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా నాయకులు, ప్రజలు సహకరించిన తీరు అభినందనీయమన్నారు. నాలుగో తేదీన జరిగే కౌంటింగ్‌తో పాటు, ఫలితాల వెల్లడి సమయంలో కూడా నాయకులంతా సంయమనంతో, హుందాగా వ్యవహరించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా నమోదయ్యే కేసులను వివరించారు.

హౌసింగ్ ఏఈ వెంకట్రావు సేవలు అభినందనీయం

మధురపూడి: గృహ నిర్మాణ శాఖ ఏఈ ఆకుల వీర వెంకట్రావు ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమని కోరుకొండ ఎంపీడీఓ హేమసుందరరావు కొనియాడారు. ఏఈ వెంకట్రావు ఉద్యోగ విరమణ సభ శనివారం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విరమణ అనేది ఉద్యోగానికే గానీ, ఆశయాల సాధనకు కాదన్నారు. విధులు నిర్వహిస్తుండగా లబ్ధిదారులకు సంపూర్ణ సేవలందించే అవకాశం కొన్ని శాఖలకు మాత్రమే దుక్కుతుందని, దానిలో గృహనిర్మాణ శాఖ ముఖ్యమైనదన్నారు. అనంతరం ఏఈ వెంకట్రావును శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, ఏపీఎం భ్రమరాంబిక, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ పుణ్యమూర్తి, వశిష్ట, గృహనిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మండల కమిటీ ఎంపిక

సీతానగరం: స్థానిక సీపీఐ ఎంఎల్ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో శనివారం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సిద్దే నాగరాజు, మహిళా అధ్యక్షురాలిగా కొండేపూడి ఆదిలక్ష్మిని ఎంపిక చేశారు. వీరబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: గంగంగణేశా
సూర్యమినీ	: మిస్టర్ అండ్ మిసెస్ మహి
సూర్యప్యాలెస్	: భజేవాయువేగం
స్వామి	: భజేవాయువేగం
శివజ్యోతి	: లవ్‌మీ
అనుశ్రీ	: హిట్‌లిస్ట్
రాజా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
ఊర్వశి	: ఆ ఒక్కటీ అడక్కు
రంభ	: రాజు యాదవ్
మేనక	: బాక్
అప్సర	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి నామవరం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
మురళీకృష్ణ కడియం	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
వెంకటసూర్య	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజేవాయువేగం

